వైఎస్ఆర్-అన్నమయ్య

వార్త

తెలుగు జాతీయ దినపత్రిక

శనివారం 18 జనవరి 2025



మంత్రి వర్గ సమావేశంలో పాల్గొన్న రాంప్రసాదరెడ్డి

## పోలీస్ బందోబస్తుల మధ్య మండల సమావేశం

**కురబలకోట, జనవరి 17 ప్రభాతవార్త :**



పోలీస్ బందోబస్తుతో శుక్రవారం కురబలకోట మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపిపి దస్తగిరిసాబ్ అధ్యక్షతన ఈ సమావేశాన్ని నిర్వహించారు. గతంలో రెండు పర్యాయాలు మండల సమావేశాన్ని టిడిపి శ్రేణులు అడ్డుకోవడంతో వాయిదా పడింది. దీంతో మండల ఎంపిటిసిలు, జడ్పిటిసి, ఎంపిపిలు సమావేశాన్ని నిర్వహించేందుకు తగిన బందోబస్తు కల్పించాలని కోరుతూ హైకోర్టు నుంచి ఉత్తర్వులు తీసుకువచ్చారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు జడ్పి సిఈఓ, ఎంపిడిఓలు కూటమి నాయకులతో గురువారం సమావేశం నిర్వహించి మండల సర్వసభ్యస మావేశాన్ని సజావుగా జరిగేందుకు సహకరించాలని కోరారు. ఈ నేపథ్యంలో మదనపల్లె డిఎస్పి కొండయ్యనాయుడు ఆదేశాల మేరకు మదనపల్లె రూరల్ సిఐ, ఎస్ఐలు, సిబ్బందిని ఎంపిడిఓ కార్యాలయం వద్ద బందోబస్తు నిర్వహించి సమావేశాన్ని సజావుగా జరిగేలా చర్యలు చేపట్టారు.

### జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా

# స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు నిర్వహించాలి

**రాయచోటి, జనవరి 17 ప్రభాతవార్త**

ఈ నెల 18న జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ నందలి తన చాంబర్లో జిల్లాలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల నిర్వహణపై వివిధ శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీ, గ్రామపంచాయతీలలో "స్వచ్ఛ ఆంధ్రస్వచ్ఛతా హీ సేవా"కార్యక్రమాలు పటిష్టంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాలను అన్ని శాఖలు సమన్వయంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఇకపై జిల్లాలో ప్రతినెల మూడవ శనివారం స్వచ్ఛతాహి దివస్ కార్యక్రమాలను తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా 18న శనివారం పరిసరాల పరిశుభ్రత పై ప్రజలను భాగస్వాములను చేస్తూ మానవహారాలు, ర్యాలీ తదితర అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రతి మున్సిపాలిటీ, గ్రామపంచాయతీలలో శుభ్రత కార్యక్రమాలను అమలు చేసి చెత్త చెదారాలను తొలగించాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలు, అన్ని ప్రభుత్వ, ప్రవేట్ విద్యా సంస్థలు, బహిరంగ స్థలాలలో స్వచ్ఛత ప్రతిజ్ఞ పాటించి శ్రమదానం నిర్వహించి పరిసరాలను పరిశుభ్రం చేయాలన్నారు. ప్రజా ప్రతినిధులను, ప్రముఖులను భాగస్వాములను చేస్తూ స్వచ్ఛతా హి సేవ పై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా కూడా పారిశుద్ధంపై అవగాహన కల్పించాలని అన్నారు. తాగునీటి వనరుల క్లోరినేషన్, ఉద్యాన వనాలు, ఆలయాలు, పర్యాటక కేంద్రాల సుందరీకరణ, బస్టాప్ మార్కెట్ ప్రదేశాలలో పరిశుభ్రత పనులు చేపట్టాలని చెప్పారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, చెత్త కుప్పలు, బోరు బావుల చుట్టుపక్కల మొదలగు ప్రదేశాల్లో మెగా శుభ్రత డ్రైవ్ లు నిర్వహించాలన్నారు. ఎంపీడీవోలు, ఆర్డబ్ల్యూఎస్ ఏఈలు, విస్తరణాధికారులు, సంబంధిత అధికారులు, గ్రామ స్థాయి సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. స్వచ్ఛతా హి సేవ నిర్వహణలో ప్రజలు, విద్యార్థుల భాగస్వామ్యం ఉండాలన్నారు. ఇకపై ప్రతినెల మూడవ శనివారం జిల్లాలో స్వచ్ఛందర కార్యక్రమాలను తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. అన్ని గ్రామాల్లో పెద్ద ఎత్తున శ్రమదానం ద్వారా చెరువులు, కాలువలు, కుంటల వద్ద వ్యర్థపదార్థాలు తొలగింపు వంటి కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు. సంపూర్ణ స్వచ్ఛత కార్యక్రమం కింద అన్ని మున్సిపాల్టీల్లో, అన్ని గ్రామ పంచాయతీల్లో శ్రమదానం కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో మెప్మా, స్వయం సహాయక సంఘాలు, ఎన్జీవోలను భాగస్వాములను చేసుకొని కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించాలన్నారు. మండల పరిషత్ అధికారులు, పంచాయతీ అధికారులు, పంచాయతీ కార్యదర్శులను, ఇతర శాఖ అధికారులను సమన్వయం చేసుకుంటూ ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో డి.ఆర్.ఓ మధుసూదనరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## రాజంపేట ఎఎస్పిగా బాధ్యతలు చేపట్టిన మనోజ్ రామ్‌నాథ్ హెగ్డే

**(అన్నమయ్య ప్రతినిధి - ప్రభాతవార్త)**



రాజంపేట ఎఎస్పిగా శుక్రవారం ఉదయం మనోజ్ రామ్‌నాథ్ హెగ్డే బాధ్యతలు చేపట్టారు. రామ్‌నాథ్ హెగ్డే బాధ్యతలు చేపట్టేందుకు వచ్చిన సందర్భంగా రాజంపేట పోలీస్ సబ్ డివిజన్ పరిధిలోని డిఎస్పీ, సిఐలు, ఎస్ఐలు ఘనంగా స్వాగతం పలికారు. డిఎస్పీ పుష్పగుచ్ఛం ఎఎస్పికి అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నూతనంగా ఎఎస్పిగా బాధ్యతలు చేపట్టిన మనోజ్ రామ్‌నాథ్ హెగ్డే మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. అన్ని వర్గాల ప్రజలు సైబర్ క్రైమ్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అసాంఘీక కార్యకలాపాలపై నేరుగా తనకు ఎవ్వరైనా సమాచారం ఇవ్వోచ్చన్నారు. ప్రజాసమస్యల పరిష్కారంలో నిత్యం తాను అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. పోలీసులను కలవడానికి ఎలాంటి ఫర్మిషన్ అవసరం లేదన్నారు. ప్రజలు నేరుగా తన కార్యాలయానికి వచ్చి సమస్యలపై ఫిర్యాదు చేయవచ్చాన్నారు. వ్యవస్థ బాగున్నప్పుడే సమాజంలో శాంతి భద్రతల సమస్య తలెత్తదన్నారు. ప్రజలు తమకు జరిగే అన్యాయాలపై పోలీసు శాఖ పరిధిలోకి వచ్చే ఏ సమస్య అయినా నిర్భయంగా పోలీసుస్టేషన్‌కు వచ్చిచ తెలియజేయవచ్చని ఎఎస్పి మనోజ్ రామనాథ్ హెగ్డే తెలిపారు.

**- ఎఎస్పి హయాంలో దీర్ఘకాలిక ప్రధాన సమస్యలు కొలిక్కి వచ్చేనా..!**

అన్నమయ్య జిల్లాలో దీర్ఘకాలిక సమస్యలకు నెలవైన రాజంపేట పోలీసు సబ్ డివిజన్ మొత్తం సుమారుగా 117 చదరపు మైళ్ల విస్తీర్ణంలో విస్తరించి ఉంటుందని అంచనా. ఈ సబ్ డివిజన్ నెల్లూరు, తిరుపతి, కడప జిల్లాలకు మధ్యలో ఉంది. ఈ పోలీసు సబ్ డివిజన్ 3 దశాబ్దాలకు పైబడి ఏర్పడినప్పటి నుండి కనీసం ప్రధానమైన దీర్ఘకాలిక సమస్యలు కొలిక్కి వచ్చింది లేదు. ఈ ప్రధానమైన సమస్యలన్నీ ప్రభుత్వం ద్వారా ప్రజాప్రతినిధులు పరిష్కరించుకోవల్సినవే అధికం. ప్రభుత్వం ద్వారా నిధులు సమకూర్చుకొని పరిష్కరించుకోవడం పోలీసు శాఖకు అంత ఆషామాషీ వ్యవహారమైతే కాదు. కనుక స్థానికంగా ఎలాంటి చర్యలు తీసుకోవడం ద్వారా పరిష్కరించుకునేందుకు వీలవుతుందన్న దానిపై ఎఎస్పి రామ్‌నాథ్ హెగ్డే దృష్టి సారించి తగు విధమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుంది. రేణిగుంట-కడప హైవే అధికశాతం ఈ పోలీసు సబ్ డివిజన్ పరిధిలోకే వస్తుంది. ఇక్కడ ప్రమాదాలు జరగని రోజంటూ ఉండదు. ఈ రహదారిలో రోడ్డు ప్రమాదాల నివారణకు సత్వర చర్యలు అవసరం. ఇకపోతే ప్రస్తుతం ఈ రహదారి గుంతలమయంగా మారి ఉంది. దీంతో వాహనాల రాకపోకలకు కూడా తీవ్ర ఇబ్బందికరంగా తయారైంది. ప్రభుత్వం గుంతలు లేని రహదార్ల కోసం ప్రత్యేకంగా నిధులు సమకూర్చి ఉంది. ఈ దిశగా దృష్టి సారిస్తే కనీసం ఈ రహదారిని గుంతలు లేని హైవేగా మార్చేందుకు వీలవుతుంది. తద్వారా కొంతవరకైనా ప్రమాదాల నివారణ జరుగుతుంది. ఇక సబ్ డివిజన్ కేంద్రమైన రాజంపేట ప్రధాన రహదారి, ఆర్‌యస్ రోడ్డులలో వాహనాల రాకపోకలతో ట్రాఫిక్ ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. రద్దీని దృష్టిలో ఉంచుకొని వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా అవసరమైన చర్యలపై దృష్టి పెట్టాల్సి ఉంది. వన్‌వే పద్దతి ద్వారా, లేక ఇతరత్రా పోలీసుశాఖ చట్టపరిధిలో తీసుకునే చర్యలు ఏవైనా ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి వీలవుతుందేమో అన్న కోణంలో కూడా దృష్టి పెట్టాల్సి ఉంది. అలాగే ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఎర్రచందనం నిల్వలు కూడా ఇక్కడ అధికమే. అక్రమ ఎర్రచందనం రవాణాను అరికట్టేందుకు అవసరమైన చర్యలు అవసరం. ఇక పోలీసు శాఖ పరంగా కూడా ఎదురవుతున్న అనేక సమస్యలు పరిష్కరించుకోవాల్సి ఉంది. సామాజికంగా, ఆర్థికంగా సమస్యలు కోకొల్లలుగా ఉన్నప్పటికి ప్రధానమైన సమస్యల పరిష్కారం అత్యవసరంగా కనిపిస్తుంది.

### నల్సా పథకాలపై న్యాయ సేవల సభ్యులకు

# ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమం




**కడప లీగల్, జనవరి 17, ప్రభాతవార్త:**

జాతీయన్యాయ సేవాధికార సంస్థ న్యూఢిల్లీ మరియు ఏపీ రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల మేరకు గరికపాటి దీనబాబు 4వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఇన్‌ఛార్జి ఛైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సూచనల మేరకు సీనియర్ సివిల్ జడ్జీ ఎస్.బాబాఫకృద్దీన్ నల్సా (బాలల సంరక్షణ కొరకు స్నేహపూర్వక న్యాయ సేవల పథకం 2024, జాతీయ న్యాయ సేవాధికార సంస్థ వారి మానసిక అనారోగ్యం ఉన్న వ్యక్తులు మరియు మేధో వైకల్యాలలున్న వ్యక్తులకు చట్టపరమైన సేవలు పథకం - 2024లపై న్యాయ సేవల సభ్యులకు ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ న్యాయ సేవాధికార సంస్థ (నల్సా) వారి బాలల సంరక్షణ కోసం స్నేహపూర్వక న్యాయ సేవల పథకం - 2024, లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ తదితర చట్టాల గురించి వివరించారు. అలాగే లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నెంబర్ 15100, చైల్డ్ లైన్ హెల్ప్‌లైన్ నెంబరు 1098, దివ్యాంగజన్ హెల్ప్‌లైన్ నెంబరు 14456, ఉచిత న్యాయ సహాయం తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో న్యాయ సేవా సభ్యులైన కడప శాశ్వత లోక్ అదాలత్ మరియు పబ్లిక్ యుటిలిటీ సేవలు ఛైర్మన్ స్వర్ణప్రసాద్, జిల్లా చైల్డ్ ప్రొడక్షన్ ఆఫీసర్ సుభాష్ యాదవ్, హెలెన్ కెల్లర్ స్కూలు మరియు కాలేజీ కరస్పాండెంట్ దౌలత్‌ఖాన్, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటరీలు పాల్గొన్నారు.

## ముఖ్య మంత్రి గారూ! కడప జిల్లాపై మీకు అంత కక్ష ఎందుకు?

**వేంపల్లి, జనవరి 17, ప్రభాతవార్త :**



కడప జిల్లా పై ముఖ్య మంత్రి కక్ష కట్టడం దురదృష్టకరమని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్ తులసి రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం వేంపల్లిలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత సార్వత్రిక ఎన్నికల్లో కడప జిల్లా ప్రజలు 7 అసెంబ్లీ స్థానాలకు గానూ 5 స్థానాలలో టిడిపి కూటమి అభ్యర్థులను గెలిపించారని, అయినప్పటికీ కూటమి ప్రభుత్వం కడప జిల్లాకు అన్యాయం చేస్తూ వుందన్నారు. అధికారం లోకి వచ్చి 7 నెలల కాలంలో జిల్లాకు అనేక అన్యాయాలు జరిగాయన్నారు. రాష్ట్ర మంత్రి వర్గంలో జిల్లాకు ప్రాతినిధ్యం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రెండు దఫాలుగా కొండవీటి చాంతాడంత నామినేటెడ్ పదవుల జాబితా ప్రకటించింది. అందులో కడప జిల్లా నుంచి ఒక్క చైర్మన్ లేరన్నారు. పుష్పకవిమానం లాంటి టిటిడి బోర్డులో కడప జిల్లా నుంచి ఒక్కరూ కూడా లేరన్నారు. శాంతి భద్రతల దృష్ట్యా కడప జిల్లా సున్నితమైన, కీలకమైన జిల్లా అని, గత రెండున్నర నెలలుగా రెగ్యులర్ ఎస్పీ లేదని, పొరుగున వున్న అన్నమయ్య జిల్లా ఎస్పీనే ఇన్చార్జి ఎస్పీగా వున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం కొప్పర్తి పారిశ్రామిక వాడకు రూ.250 కోట్లతో ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్ ను మంజూరు చేసిందని, దీనిని కొప్పర్తి నుండి అమరావతికి తరలిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో జారీ చేసిందన్నారు. .పులివెందుల ప్రభుత్వ వైద్య కళాశాలకు 2024, 25 విద్యా సంవత్సరానికి 50 ఎంబీబీఎస్ సీట్లు కేటాయిస్తూ నేషనల్ మెడికల్ కమీషన్ అనుమతి ఇచ్చిందని, మేము నిర్వహించ లేమని, వసతి సౌకర్యం లేదని, ఫాకల్టీ లేదని, ఆ సీట్లు మాకు వద్దు అని రాష్ట్ర ప్రభుత్వం నేషనల్ మెడికల్ కమీషన్ కు లేఖ రాయడంతో. 50 సీట్లు రాకుండా పోయాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ నిధులు విడుదల చేయని కారణంగా కడప రాయచోటి మదన పల్లి బెంగుళూరు నూతన బ్రాడ్ గెజ్ పనులు మధ్యలో నిలిచిపోయాయన్నారు. శనివారం ముఖ్య మంత్రి కడప జిల్లాకు వస్తున్న సందర్భంగాపై సమస్యలపై దృష్టి సారించాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలో కాంగ్రెస్ నాయకులు ధ్రువకుమార్‌రెడ్డి, సుబ్రమణ్యం, రామకృష్ణ, అమర్‌నాథ్‌రెడ్డి, ఉత్తన్న,నాగరాజు, సుబ్బ రాయుడు,వెంకటేష్, రమణ,మహబూబ్ బాషా,వేమా రాజా,వెమయ్య,బద్రి,,రవి,మధార్,తదితరులు పాల్గొన్నారు.

### 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలను

# పండుగ వాతావరణంలో నిర్వహించాలి



**రాయచోటి, జనవరి 17 ప్రభాతవార్త**

ఈ నెల 26న స్థానిక పోలీస్ పెరేడ్ మైదానంలో జరిగే 76వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకలను పండుగ వాతావరణంలో కన్నుల పండుగగా నిర్వహించి విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి జిల్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలు నందు 76వ భారత గణతంత్ర దినోత్సవ వేడుకల ముందస్తు ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అధికారులు బాధ్యతాయుతంగా కృషి చేయాలన్నారు. వేడుకలలో అధికారులకు కేటాయించిన విధులు సమన్వయంతో పక్కాగా నిర్వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. జెండా వందన కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను వేదికను అందంగా అలంకరించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజాప్రతినిధులు, స్వాతంత్ర సమరయోధుల కుటుంబ సభ్యులు, ఇతర అతిథులను వేడుకలకు ప్రత్యేకంగా ఆహ్వానించాలని సూచించారు. ప్రోటోకాల్ మేరకు ఆహ్వాన పత్రికలు అందరికీ పంపించాలన్నారు. పెరేడ్ మైదానంలో సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను కన్నుల పండుగ సాగేలా సంసిద్ధం చేయాలని, నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రభుత్వ అభివృద్ధి పథకాల కార్యక్రమాలను ప్రతిబింబిస్తూ వివిధ శాఖలు ఏర్పాటు చేసే శకటాల ప్రదర్శన ఆకర్షణీయంగా అందరినీ ఆకట్టుకునేలా ఉండాలన్నారు. అలాగే ఆయా శాఖలు ఎగ్జిబిషన్ స్టాల్స్ ను కూడా ఏర్పాటు చేయాలన్నారు. పోలీస్ పెరేడ్ మైదానంలో షామియానా, కుర్చీలు, బారికేడింగ్ ఏర్పాట్లు పర్యవేక్షించాలని ఆర్డిఓ, తహసీల్దార్, మునిసిపల్ కమీషనర్ లకు సూచించారు. జాతీయ జెండా ఎగరవేయుట, వేదిక అలంకరణ, సీటింగ్ ఏర్పాట్లు, త్రాగునీటి ఏర్పాట్లు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, ఉద్యోగులకు ప్రశంసా పత్రాల జారీ, ప్రోటోకాల్ మేరకు ఆహ్వాన పత్రికలు పంపిణీ తదితర అంశాలలో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించి పలు సూచనలు జారీ చేశారు. రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి వచ్చే విద్యార్థులకు స్నాక్స్, వాటర్ బాటిల్స్ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, ఏఎస్పి వెంకట రత్నం, డిఆర్ఓ మధుసూదనరావు, ఆర్డిఓ శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# దోమల నివారణపై అవగాహన సదస్సు

**సిద్దవటం, జనవరి 17, ప్రభాతవార్త:**

సిద్దవటం మండలంలోని మాధవరం-1,2,3 వార్డులలో శుక్రవారం డ్రై డే ఫ్రైడే సందర్భంగా దోమల వ్యాప్తిని అరికట్టేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై హౌస్ టు హౌస్ సర్వే చేసి గృహ నిర్వాహకులకు తెలిపారు. ఈ సందర్భంగా మలేరియా సబ్ యూనిట్ అధికారి ఇండ్ల సుబ్బరాయుడు మా ట్లాడుతూ వ్యాధి కారకమైన దోమ కుడితే విష జ్వరాలు సోకుతాయని దోమల నియంత్రణకు మనమందరం ఒక బాధ్యతగా తీసుకొని విష జ్వరాలు రాకుండా మీ ఇంటి పరి సర ప్రాంతాల్లో ఎనీరు నిల్వ లేకుండా చూడాలని మురికి నీరు నిల్వలో వారానికి ఒక సారి కిరోసిన్ ఆయిల్ బాల్స్, ఇంజిన్ ఆయిల్ చల్లడం వలన దోమలు కుట్టడం వల్ల మలేరియా, చికెన్ గున్యా, డెంగీ వంటి విష జ్వరాలు సోకుతాయని రాత్రి వేళలో నిద్రించేటప్పుడు ప్రతి ఒక్కరూ దోమల తెరలు వాడాలని కిటికీలు, తలుపులు తెరచి ఉండకుండా చూసుకోవాలని సూచనలు చేశారు. ఒళ్లు నొప్పులు, జ్వరాలు, కళ్లు తిరగడం వంటి లక్షణాలు ఉన్న వారు ఆర్ఎంపీ డాక్టర్ వద్దకు వెళ్లవద్దని ఎంబీబీఎస్ వైద్యులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ రమణయ్య, పీహెచ్ఎన్ కాంతామణి, ఎంపీహెచ్‌సీ యానాదయ్య, ఆరోగ్య కార్యకర్త యశోధ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.





# ధర లేక వరి రైతులు ఆందోళణ

**దువ్వూరు, జనవరి 17, ప్రభాతవార్త:**

మండల పరిధిలో కేసీ కాలువ కింద వరి సాగు చేసిన రైతులు తమ పంట దిగుబడులు తీస్తున్నారు. అందులో బాగంగా వరి ధాన్యానికి సరైన గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం 76కేజీల బస్తా ధర 1400రూపాయల వరకు పలుకుతుంది. ఇదే గత ఏడాది 1800రూపాయల వరకు వరి రైతులు ధాన్యాన్ని విక్రయించారు. ప్రస్తుతం దువ్వూరు మండలంలో కేసీ కాలువ కింద గొట్టపు బావుల కింద సుమారు 1200ఎకరాలు వరి సాగు చేశారు. ప్రస్తుతం వరి కోతలు చివరి దశలో ఉన్నాయి. రైతులు ధాన్యం అమ్ముకోవాలంటే ధర తక్కువ ఉండటంతో ఇబ్బందులు పడుతున్నారు. వరి ధాన్యాన్ని నిల్వ చేసుకోవాలన్న గోడౌన్‌లు లభించడం లేదు. గతంలో సహకార రంగంలో 3గోదాములు నిర్మించాలని ప్రతిపాదనలు చేశారు. అందులో భాగంగా దువ్వూరు, కానగూడూరులో నిర్మాణ పనులు కూడ చేపట్టి అసంపూర్తిగా వదిలేశారు. ఇప్పటికే మండలంలో ఉన్న ప్రైవేటు గోదాములు పూర్తిగా వరి ధాన్యంతో నిండిపోయాయి. మిగిలిన ధాన్యాన్ని నిల్వ చేసుకోవాలంటే రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన గోదాములు పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు. అలాగే రైతులకు ఈ ఏడాది ఒక రకంగా వరి దిగుబడి ఆశా జనకంగా ఉండటంతో ఎకరాకు 30నుండి 32బస్తాల దిగుబడి వస్తుంది. అయినా పెట్టుబడి ఖర్చులు ఎక్కువగా కావడంతో రైతులకు ప్రస్తుత ధరల్లో గిట్టుబాటు కావడం లేదు. మండలంలో జిలకర మసూరి, ఎన్డీఎల్ఆర్, జగిత్యాల వంటి రకాలను సాగు చేశారు. దిగుబడులు ఉన్నా ధర లేకపోవడంతో వరి రైతులకు ఇక్కట్లు తప్పలేదు. సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన గోదాములు అందుబాటులోకి వస్తే రైతులకు ప్రయోజనం కలుగుతుంది.



## ఘనంగా శ్రీ కృష్ణ దేవరాయలు జయంతి వేడుకలు

### జనసేన పార్టీ నేత డా దాసరి రవిశంకర్

**వేంపల్లి, జనవరి 17, ప్రభాతవార్త :**



శ్రీ కృష్ణ దేవరాయలు జయంతి సందర్భంగా జనసేన పార్టీ పులివెం దుల నియోజకవర్గ సీనియర్ నేత డాక్టర్ దాసరి రవిశంకర్ ఆద్వర్యంలో వేంపల్లి లోని తన కార్యాలయంలో శుక్రవారం శ్రీ కృష్ణ దేవ రాయలు చిత్రపటానికి పూల మా లలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రవిశంకర్ మాట్లాడుతూ దేశ భాషలందు తెలుగు లెస్స అంటూ, తెలుగు భాష జాతి వైభవాన్ని నలుమూలల కు చాటి చెప్పిన విజయనగర సామ్రాజ్య వీరులు, అఖండ భారత మహా చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు అని కొనియాడారు. ఇందులో వేంపల్లె మండలం జనసేన యువ నాయ కుడు తిరుమల శెట్టి నాగ మల్లి కార్జున, కార్యకర్తలు, మహ బూబ్ బాషా, పరశురాముడు, శీను, శేషు, మహేష్, సాయి తేజ తది తరులు పాల్గొన్నారు

## అగ్ని మాపక కేంద్రం అధికారిగా బాధ్యతలు

**వేంపల్లి, జనవరి 17, ప్రభాతవార్త :**

వేంపల్లి అగ్నిమాపక కేంద్రం అధికారిగా బి.శివరామిరెడ్డి శుక్రవారం భాధ్యతలు స్వీకరించారు. ఈయన శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం ఫైర్ స్టేషన్ నుండి పదోన్నతి మీద వేంపల్లి ఫైర్ స్టేషన్ కు వచ్చారు.

## ద్విచక్ర వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తికి గాయాలు

**సిద్దవటం, జనవరి 17, ప్రభాతవార్త:**



సిద్దవటం మండలంలోని భాకరాపేట సమీపాన నేషనల్ హైవే రోడ్డు చర్చీ వద్ద జనవరి 15వ తేదీ రాత్రి 9 గంటలకు గుర్తు తెలియని వ్యక్తిని(50) గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అతనికి బలమైన గాయాలు అయ్యాయి. స్థానికులు 108లో కడప రిమ్స్ కు తరలించారు. ఈ సందర్భంగా ఏఎస్సై ఉబ్బ రామచంద్ర శుక్రవారం మాట్లాడుతూ గుర్తు తెలియని వ్యక్తిని ఢీకొనడంతో బల మైన గాయాలు తగలడంతో హైవే పెట్రోలింగ్ పోలీసులు అంబులెన్స్ లో రిమ్స్ కు తరలించడం జరిగిందన్నారు. ఢీకొన్న వాహనం కోసం గాలిస్తున్నామని ఏ ఎస్సై తెలిపారు. గాయపడిన వ్యక్తి బంధువులు ఉంటే తమను సంప్రదించాలన్నారు.

## వైద్యం పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి

**సిద్దవటం, జనవరి 17, ప్రభాతవార్త:**



సిద్దవటం మండలంలోని భాకరాపేట గ్రామంలో అనారోగ్యంతో బా ధపడుతున్న వ్యక్తిని గురువారం 108 వాహనంలో కడప రిమ్స్ కు తర లించారు. స్థానిక ఏఎస్సై సుబ్బరామచంద్ర చెప్పిన కథనం మేరకు భాక రాపేట గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తి అనారోగ్యంతో ఉన్న విష యాన్ని గమనించి 108 వాహనంలో వైద్య పరీక్షలకు రిమ్స్ కు తరలించామని వైద్యం పొందుతూ గురు వారం రాత్రి మృతి చెందినట్లు రిమ్స్ వైద్యులు తెలిపారన్నారు. బంధువులు ఎవరైనా ఉంటే కడప రిమ్స్ కు రావాలని ఏఎస్సై తెలిపారు.

## బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు

**సిద్దవటం, జనవరి 17, ప్రభాతవార్త:**

సిద్దవటం మండలంలోని మాధవరం-1లో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడగా శుక్రవారం బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై సుబ్బరామచంద్ర తెలిపారు. ఆయన మా ట్లాడుతూ మాధవరం-1 గ్రామ పంచాయతీలోని పార్వతీపురం రోడ్డు నెంబర్-4లో ప్రభుత్వ బీసీ హాస్ట ల్‌లో వంట మనిషిగా విధులు నిర్వహిస్తున్న అన్నిక పెంచలమ్మ గృహంలో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారన్నారు. రూ.1.50లక్షలు విలువ చేసే 50 గ్రాములు బంగారు ఆభరణాలు, రూ.36వేలు నగదు చోరీకి పాల్పడ్డారన్నారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై సుబ్బరామచంద్ర తెలిపారు.

## జయరామయ్య మృతికి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే

**బద్వేలు,జనవరి 17, ప్రభాతవార్త :**



పట్టణంలోని ఆంజనేయనగర్‌కు చెందిన టీడీపీ సీనియర్ నాయకులు టింబర్ డిపో జయరామయ్య(75) గురువారం మృతి చెందిన విషయం విధితమే. గత కొద్దిరోజులుగా అనా రోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూమృతి చెందారు. మాజీ మంత్రి బిజివేముల వీరారెడ్డికి సన్ని హితుడిగా ఉంటూ మాజీ ఎమ్మెల్యే విజయమ్మకు ముఖ్య అనుచరుడిగా గుర్తింపు పొందారు. నేటి రాజకీ యాలలోకూడా జయరామయ్య, ప్రత్యేక పాత్ర పోషించారు. ఆయన మృతికి శుక్రవారం మాజీఎమ్మెల్యే విజయమ్మ నివాళులర్పించి వారి కుటుంబానికి ధైర్యం చెప్పారు. జయరామయ్య మృతితో టీడీపీ ఓ మంచి నాయకుడిని కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. నివాళులర్పించిన వారిలో వెంగళరెడ్డి, మ స్తాన్ బాబు, మిత్తికాయల రమణ, బద్వేలు పెద్ద చెరువు చిన్న తూము చైర్మన్ కొర్రపాటి సురేంద్ర, పెద్దతూము వైస్‌చైర్మన్ దద్దం వెంకటేశ్వర్లు, బలిజ సంఘం అధ్యక్షులు సింగంశెట్టి వెంకటసుబ్బయ్య, చిన్ని సుబ్బారావు, కొంకుల రమణ, జనసేన నాయకులు తుడిమెళ్ల మురళి, పీవీఎన్.ప్రసాద్, కనమర్ల పూటి ప్రసాద్, ఉపాధ్యాయులు వెంకట్, అల్లం వెంకటసుబ్బయ్య, తదితరులు ఉన్నారు.

## నేడు మిట్స్‌లో సినిసాంగ్ ప్రారంభోత్సవం

**కురబలకోట, జనవరి 17 ప్రభాతవార్త :**

మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం సినిమా సాంగ్ ప్రారంభిస్తున్నట్లు వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామనాథం తెలిపారు. హీరో కిరణ్ అబ్బవరన్ నూతన సినిమా ధిల్‌రుబా సినిమా సాంగ్ ప్రారం భోత్సవాన్ని నిర్వహిస్తారని హీరోయిన్ రుక్సాకోదిల్లన్ పాల్గొంటారని ఆయన తెలిపారు.

## నేడు విద్యుత్‌కు అంతరాయం

**మదనపల్లె, జనవరి 17 ప్రభాతవార్త :**

పట్టణంలో శనివారం సబ్‌స్టేషన్‌లో మరమ్మత్తు పనులు చేస్తుండడంతో పట్టణమంతా విద్యుత్‌కు అం తరాయం కలగనున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ గంగాధరం తెలిపారు. ఉదయం 10గంటల నుంచి 12గంటల వరకు విద్యుత్‌ను నిలుపదల చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ విద్యుత్ అంతరాయంకు ప్రజలకు సహకరించాల్సిందిగా ఆయన కోరడమైంది.

## పీలేరు ఏపీఓగా అశోక్‌రెడ్డి

**పీలేరు, జనవరి 17ప్రభాతవార్తః**



పీలేరు మండలం ఉపాధిహామీ ఏపీఓగా అశోక్‌రెడ్డి నియమితులైయ్యారు. శుక్రవారం ఈమేరకు జిల్లా అధికారుల నుంచి నియామక ఉత్తర్వులు అం దాయి. ఈసందర్భంగా అశోక్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధిహామీ పనుల్లో అర్హుల కు అవకాశాలు కల్పించి మార్గదర్శకంగా విధులు నిర్వహిస్తామని ఎలాంటి అవినీతి అక్రమాలకు తావులేకుండా చర్యలు తీసుకుంటామని ఆయన అ న్నారు. లక్ష్యం మేరకు కూలీలకు పనులు కల్పించి అడిగినవారందరికి అవకాశాలు కల్పిస్తామని ఈ సందర్భంగా ఆయన చెప్పారు.

## పోత్తప్పిరామయ్య మృతి టిడిపికి తీరని లోటు

**ఒంటిమిట్ట జనవరి 17 ప్రభాతవార్త:**



తెలుగుదేశం పార్టీ ఆవిర్భావంనుండి ఒంటిమిట్ట మండలంలో క్రియాశీలక నాయకునిగా ప్రత్యేకించిఒంటిమిట్ట గ్రామ పంచాయితీలో ముఖ్యమైన నాయ కునిగా ఉంటూ తెలుగుదేశం పార్టీ పక్షాన ప్రజా సమస్యల పరిష్కారం కోసం కార్యకర్తల ఐక్యత కోసం పాటుపడిన పోత్తప్పి రామయ్య మృతి చెందడం టిడిపికి లోటని మండల టిడిపి నాయకుడు, రాష్ట్ర మాజీ డైరక్టర్ కోమరా వెంకటసరసయ్య, మండల టిడిపి నాయకుడు మామిళ్ళ ఈశ్వరయ్యలు తెలి పారు.శుక్రవారం రామయ్యకడపలోని ప్రవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలి పారు. మండల పార్టీకి ఆయన మరణం తీరని లోటు ఆని తెలిపారు. రామయ్య కుటుంబసభ్యులకు, కుమారుడు తెలుగుయువత నాయకులు హరికి మండల టిడపి తరుపున ప్రగాఢ సానుభూతిని తెలియ జేశారు.

## స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్

**రామసముద్రం జనవరి 17ప్రభాతవార్త**



కలెక్టర్ ఆదేశాలు మేరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు మండల కేం ద్రంలోను, పంచాయితీలలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివాస్ కార్యక్రమం నిర్వ హిస్తున్నట్లు ఎంపిడిఓ భానుప్రసాద్ తెలిపారు. ఎంపిడిఓ మాట్లాడుతూ ప్రతి నెల మూడవ శనివారం రోజున స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. చేపట్టవలిసిన కార్యక్రమాలు విధి విధానాలను కూడ ప్రభుత్వం విడుదల చేయడం జరిగింది. ప్రతి ఒక్క పంచాయితీ కార్యదర్శులు గ్రామ పంచాయితీ కార్యాలయాల్లో సర్పంచ్ లు, ఎంపి టీసీ లు, వార్డు మెంబెర్స్,ఎస్ హెచ్ జి మహిళలు, విద్యార్థులు అందరూ కలుపుకొని, పబ్లిక్ ప్రదేశాల లో, ఆఫీస్ లలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ దివాస్ పేరు తో నిర్వహించడం జరుగుతుందన్నారు. దీనికి సంబం దించి ప్రతి నెల ప్రభుత్వం ఒక థీమ్స్‌తో కార్యక్రమాలు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించడం జరుగుతుం దన్నారు. కావున ప్రతి ఒక్క కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు ఆయా శాఖలకు సంబందించి నోడల్ అధికారులుగా ఉంటారని ప్రభుత్వ ఆదేశాలను పాటించాలన్నారు. ప్రతి గ్రామ పంచాయతీ లలో పరిశుభ్రత, ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఎంపిడిఓ తెలిపారు.

## ఘనంగా శ్రీకృష్ణ దేవరాయల జయంతి వేడుకలు



**బద్వేలు అర్బన్, జనవరి 17 ప్రభాతవార్త**

పట్టణంలో శ్రీకృష్ణదేవరాయల 554 వ జయంతి వేడుకలు బలిజ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు బలిజ సంఘం నాయకులు మాట్లాడుతూ దేశభా షలందు తెలుగు లెస్స అంటూ " జాతి వైభవాన్ని ప్రపంచ నలుమూల తెలియజేసిన విజయనగర సామ్రాజ్య వీరులు అఖండ మహా చక్రవర్తి" శ్రీకృష్ణదేవరాయలు అనీ, ఆయన ఖ్యాతి గురించి ఎంత చెప్పినా తక్కువే అన్నారు. అష్టదిగ్గజాలను తన కొలువులో నియమించి కవులకు ప్రత్యేక స్థానం కల్పించా రన్నారు. సాహితీ సమరాంగ భౌమునిగా పేరొందిన కృష్ణదేవరాయలు నాటికి, నేటికీ పాలకులందరికీ ఆదర్శమని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బలిజ సంఘం అధ్యక్షుడు సింగంశెట్టి వెంకటసుబ్బయ్య, టిడిపి సీనియర్ నాయకులు మాజీ పట్టణ అధ్యక్షులు డాక్టర్ కొంకుల రాంబాబు, చిన్న తుమ్ము చైర్మన్ కొరపాటి సురేంద్ర , బిజెపి పట్టణ వైస్ ప్రెసిడెంట్ ధర్మిశెట్టి వెంకటసుబ్బయ్య, బిసి సంఘం ప్రెసిడెంట్ గురుమూర్తి, కొణిదెల శేఖర్ రాయల్ , కుప్పాల నరసింహులు, కుప్పాల తేజ నరసిం హ ప్రసాద్, బలిజ సంఘ ఉపాధ్యక్షులు వెంకటరమణ, శ్రీనివాసులు, నారాయణ, జనసేన నాయకులు పెద్ది సుధాకర్, తెలుగు యువత నాయకులు కొంకుల రవికుమార్ , చిన్నయ్య, సాంబయ్య , కొణిదల లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## డ్యూటీ రాకేష్ ని కలిసిన టిడిపి నాయకులు భూషణం

**బద్వేలు అర్బన్ జనవరి 17 ప్రభాతవార్త :**



ఆంధ్రప్రదేశ్ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డ్నుడే రాకేష్ ను శుక్రవారం విజయవాడలో వారి కార్యాలయంలో బద్వేల్ పట్టణానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు వడ్లపూటి నాగభూ షణం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి వారికి అభినం దనలు తెలియజేశారు, అనంతరం నాగభూషణం మాట్లాడుతూ బద్వేల్ ప్రాంతంలో అనేకమంది నిరుపేద వైశ్యులు వ్యాపారస్తులు ఉన్నారని వారికి ఆర్యవైశ్య కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు అర్హులైన ప్రతి ఒక్కరికి వచ్చేలా కృషి చేయాలని బద్వేల్ ప్రాంతంలో నెలకొన్న సమ స్యలను వారి దృష్టికి తీసుకుపోయారు, స్పందించిన ఆర్యవైశ్య కా ర్పొరేషన్ చైర్మన్ డ్నాడే రాకేష్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా నిరుపేదరికంలో ఉన్నటువంటి ప్రతి వైశ్య కుటుంబానికి ప్రభుత్వం అందిస్తున్న ప్రత్యేక కార్పొరేషన్ రుణాలను అర్హులైన వారికి అందజేసే విధంగా కృషి చేస్తామని వారు తెలిపారు

## గుండెపోటుతో రిటైర్డ్ ఎస్బిఐ బ్యాంక్ మేనేజర్ మాధవరెడ్డి మృతి

**బద్వేల్ అర్బన్ జనవరి 27 ప్రభాత వార్త :**



టిడిపి నాయకులు పెద్దిరెడ్డి చెన్న కృష్ణారెడ్డి తండ్రి రిటైడు స్టేట్ బ్యాంక్ మేనేజర్ పెద్దిరెడ్డి మాధవ రెడ్డి (77) శుక్రవారం మధ్యాహ్నం గుండెపోటుతో మృతి చెందినట్లు వారి కుటుంబ సభ్యులు సమాచారం తెలిపారు వివరాల్లోకి వెళితే పెద్దిరెడ్డి మాధవరెడ్డి అనేక సంవత్సరాలుగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండి యాలో మేనేజర్‌గా పని చేస్తూ అనేకమందికి సేవలు అందించిన వారు మృతి చెందిన వార్త తెలియగానే అనేకమంది నాయకులు, రైతులు ,భారీ స్థాయిలో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు, మృతుడు మాధవరెడ్డికి భార్యతో పాటు ఇద్దరు కుమారులు ఒక కుమార్తె కలదు. నేడు సాయంత్రం వారి స్వగ్రామమైన తంగేడు పల్లె గ్రామంలో అంత్యక్రియల కార్యక్రమం జరు గును, మృతి చెందిన మాధవరెడ్డి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని పలువురు ఆకాంక్షించారు

# అమ్మాయి తలలో పేలా?



చదరువుతున్నా, నిద్రపోతున్నా కొంత మంది చిన్న పిల్లలు అసంకల్పితంగా తలను గోక్కుంటూనే ఉంటారు. పేల సమస్యే ఇందుకు కారణం. చిన్నారి మనస్వి జుట్టేమో ఎప్పుడూ నిర్జీవంగానే కనిపిస్తుంది. తల దువ్వుతుంటే చాలు చుండ్రు పొట్టులా రాలుతుంది. పిల్లల కురులు ఆరోగ్యంగా ఉండాలంటే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలియక సతమతమవుతుంటారు చాలామంది తల్లులు. అలాంటివారికోసమే ఈ చిట్కాలు.

**తడి లేకుండా..** ఆటపాటల్లో మునిగి తేలే చిన్నారులకు చెమట ఎక్కువగా పడుతుంది. పనుల ఒత్తిడో, తరవాత మాట వినరనే అనుమానమో చాలామంది తల్లులు.. తలస్నానం చేశాక తడి పూర్తిగా ఆరకుండానే రబ్బరు బ్యాండ్ పెట్టేస్తారు. ఇలా చేయడం వల్లా చుండ్రు ఇబ్బంది పెడుతుంది. జుట్టూ నిర్జీవంగా మారుతుంది. అలాకాకుండా జుట్టుని పూర్తిగా ఆరనిచ్చాక జడ వేయడం, రోజు విడిచి రోజు తప్పనిసరిగా తలస్నానం చేయడం అలవాటు చేయాలి. ఇలా చేస్తే చుండ్రు దరిచేరదు.

**పేలు లేకుండా...** తలస్నానం చేయడానికి ముందు కప్పు కొబ్బరినూనెలో రెండు చుక్కల వేపనూనె కలిపి తలకు రాసి మర్దన చేయండి. అరగంటయ్యాక గాఢత తక్కువగా ఉండే షాంపూతో తలస్నానం చేస్తే సరి. ఇలా వారినికోసారి చేస్తుంటే సమస్య దూరమవుతుంది. లేదంటే ఆముదం కొబ్బరినూనె మిశ్రమాన్నీ పట్టించొచ్చు. వేప, ఆముదంలో ఉండే రసాయనాలు, చేదు.. పేలు పారిపోయేలా చేస్తాయి.

**నిగనిగలాడేలా:** కొబ్బరినూనెలో పచ్చి ఉసిరి ముక్కలు, కాసిన్ని మెంతులు వేసి మరిగించండి. దీన్ని తలస్నానం చేయడానికి ముందు రాసుకోండి. అలానే శీకాయ, కుంకుడు కాయల్ని నీళ్లల్లో ఉడికించి రసం తీయండి. ఈ మిశ్రమాన్ని గాలిచొరని సీసాలో పోసుకుని నేచురల్ షాంపూలా వాడుకోండి. ఇవి బుజ్జాయి జుట్టుని ఆరోగ్యంగా ఉంచడంతో పాటు నిగనిగలాడేలా చేస్తాయి.

# పిల్లలకు బోర్డ్‌గేమ్‌లో పౌరాణిక కథలు!

**రామాయణ, మహాభారతాలు పౌరాణిక గాథలే కావచ్చు. కానీ, వాటినుంచి నేర్చుకోవాల్సిన జీవన నైపుణ్యాలు ఎన్నో ఉన్నాయి. అందుకే, వాటిని పసిప్రాయంలోనే పిల్లలకు పరిచయం చేయాలనుకున్నారు పిల్లల వైద్య నిపుణురాలు, చైల్డ్ డెవలప్‌మెంట్ స్పెషలిస్ట్.. డాక్టర్ అమూల్య మైసూరు. కానీ, కథలుగా చెబుతామంటే ఈ కాలం పిల్లల వినరు కదా! అందుకే వాటిని బోర్డ్‌గేమ్‌ల రూపంలో తీసుకొచ్చారీమె.**

**ఆ ప్రయాణాన్ని తెలుసుకుందాం..**

ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాలు ఉండేవి. దాంతో పిల్లలకు అనేక విషయాలు నేర్చుకునే వీలుండేది. కానీ, ఇప్పటి పిల్లలకు ఆ అవకాశం తక్కువ. దీంతో డిజిటల్ స్క్రీన్లకు అలవాటు పడిపోయి అనేక జీవన నైపుణ్యాలు నేర్చుకోవడంలో వెనకబడుతుతన్నారు. అందుకే మన సంప్రదాయం, సంస్కృతుల్లోని విలువలను ఆటల ద్వారా వారికి నేర్పించాలనుకున్నా. నేను పుట్టి, పెరిగింది హైదరాబాద్‌లోనే. ఇంట్లో వాళ్లంతా వైద్యులే కావడంతో నేనూ వైద్యవృత్తినే ఎంచుకున్నా. 15 ఏళ్లుగా చైల్డ్ డెవలప్‌మెంట్ స్పెషలిస్ట్‌గా పనిచేస్తున్నా. మాంటిస్సోరి టీచర్ శిక్షణ కూడా పొందా. నా భర్త ఇంజినీర్. మాకు ఇద్దరు పిల్లలు. కొవిడ్ సమయంలో, ఆ తరవాత కూడా పిల్లలు బాగా మొబైళ్లకు అలవాటు పడ్డారు. దాన్ని తగ్గించేందుకు ఏదైనా చేయాలనుకున్నా. అప్పుడు వచ్చిన ఆలోచనే' అవిన్యా గేమ్స్. అందులో భాగంగా ఏడాదిక్రితం 'రైడ్ విత్ రామా' పేరుతో బోర్డుగేమ్‌ని తీసుకొచ్చి. ఈ ఆట స్నేక్ అండ్ ల్యాడర్‌లానే ఉంటుంది. వాల్మీకీ రామాయణం ఆధారంగా.. రాముడు గురువు దగ్గర ఉన్నప్పటి నుంచీ లంక నుంచి సీతను తిరిగి తెచ్చుకునే వరకూ జరిగిన ప్రధాన ఘట్టాలన్నీ ఇలస్ట్రేషన్ రూపంలో పొందుపరిచా. పాచిక వేశాక, అక్కడ ఉన్న సంఘటనను బట్టి ముందుకు వెళ్లాలా? వెనక్కు రావాలా? అనే సూచనలు ఉంటాయి. ఆ కథను తెలిపే కార్డ్‌లూ ఉంటాయి. దాన్నిబట్టి మనం ఏం నేర్చుకోవచ్చో కూడా వాటిలో రాసి ఉంటుంది.

**అవార్డులు వచ్చాయి....** ఇటీవలే 'ప్లే విత్ కృష్ణ' బోర్డు గేమ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చా. ఇదో సాహస క్రీడ. కన్నయ్య బాల్యంలో చేసిన సాహసాలకు సంబంధించిన బొమ్మలు ఇందులో పొందుపరిచి ఉంటాయి. ఈ బోర్డులో రెండు మోడ్‌లు ఉంటాయి. ఎక్కువ కాయిన్లు సేకరించి గెలుపొందడం ఒకటి. కాయిన్లతో సంబంధం లేకుండా గమ్యాన్ని చేరుకోవడం మరొకటి.

ఏ సంఘటన మీద పడితే ఎన్ని కాయిన్లు సేకరించాలి? వేరే వాళ్లకు ఎన్ని ఇవ్వాలి? అనే సూచనలు అందులో ఉంటాయి. మధ్యలో యాంగర్, కామ్‌డౌన్, ట్రూ, గ్రాటిట్యూడ్.. లాంటి జోన్లమా ఏర్పాటుచేశాం. ఈ పేర్లకు తగినట్లే యాక్టివిటీస్ ఉంటాయి. ఉదాహరణకు కామ్‌డౌన్ జోన్‌లో అడుగుపెట్టి నప్పుడు, పాచిక వేస్తాం. 1 పడితే.. ఐదుసార్లు దీర్ఘశ్వాస తీసుకోవాలి, 2 పడితే.. అంకెలను వెనక క్రమంలో చదవాలి, 3 పడితే.. ధ్యానం చేయాలి. . ఇలా మిగతా జోన్లకీ సంబంధిత యాక్టివిటీలు ఉంటాయి. ఈ ఆటల వల్ల పిల్లల్లో కమ్యూనికేషన్, బృందంతో కలిసి పనిచేయడం, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం పెరుగుతాయి. నియమ నిబంధనలు పాటించడం, గెలుపోటముల్లో స్థితప్రజ్ఞతతో ఉండడం నేర్చుకుంటారు. పాచిక వేసే అవకాశం వచ్చే దాకా వేచి ఉండే సమానం, ఓర్పు.. లాంటి కృష్ణునిలోని సుగుణాలన్నీ పిల్లలకు అలవడతాయి.




హైపరాక్టివ్, ఏడిహెచ్‌డి.. లాంటి సమస్యలు ఉన్న పిల్లల్లో ఈ



నైపుణ్యాలను నేర్పించడం అవసరం. దానివల్ల వారిలో కుదురుగా కూర్చోవడం, ఏకాగ్రత వంటివి పెరుగుతాయి. ప్రస్తుతంఒ స్టాచ్యూ ఆఫ్ ఈక్వాటిటీ, ఇస్కాన్ దేవాలయంలో స్టోర్లను ఏర్పాటుచేశాం. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఆన్‌లైన్ ఫాట్‌ఫామ్‌ల్లోనూ అందుబాటులో ఉంచాం. యూఎస్‌ఎ, సింగపూర్, యూకెల్లోనూ అమ్ముతున్నాం. భవిష్యత్తులో హనుమంతుడు, గణేశుని మీదా బోర్డుగేములు తీసుకురావాలనుకుంటున్నా. పుస్తకాలు, పజిల్స్ రూపంలోనూ తేవాలనే ప్రణాళిక ఉంది. ఇక, కొవిడ్ సమయంలో.. కచ్చితమైన సమాచారం అందరికీ అందాలనే ఉద్దేశంతో పేరెంటింగ్ విత్ డాక్టర్ అమూల్య పేరుతో ఇన్‌ఫ్లూయెన్సర్‌గానూ మారా. అందుకుగానూ గతేడాది ఇన్‌స్పైర్ బియాండ్ మదర్‌హుడ్ అనే కమ్యూనిటీ నుంచి బెస్ట్ ఎడ్యుకేషనలిస్ట్ అవార్డు అందుకున్నా.

## సానపురెడ్డి రాధాక్రిష్ణారెడ్డిని సత్కరించిన పెన్షనర్స్ సంఘ సభ్యులు

**బద్వేలు అర్బన్,జనవరి 17, ప్రభాతవార్త :**



విద్యావేత్త, కీ.శే.సానపురెడ్డి గోపాల్‌రెడ్డి ఆయన సతీమణి కీ.శే.నాగ ఓబుళమ్మ జ్ఞాపకార్థం పెన్షనర్స్ సంఘం కార్యాలయానికి సుమారు రూ.5లక్షలకు పైబడి విరాళాలు అందించిన సానపురెడ్డి రాధాక్రిష్ణరెడ్డి రెడ్డిని మరియు మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డిలను శుక్రవారం స్థానిక పెన్షనర్స్ కార్యాలయంలో పలువురు పెన్షనర్లు శాలువా,పూలమాలలతో సత్కరించారు. అనంతరం సానపురెడ్డి రాధాక్రిష్ణరెడ్డి కుమారుడు వివాహ మహోత్సవ ఆహ్వాన పత్రికను పలువురు పెన్షనర్స్ సంఘం సభ్యులకు మీడియా మిత్రులకు, పలువురు నాయకులకు అందజేశారు. అనంతరం రాధాక్రిష్ణారెడ్డి మాట్లాడుతూ తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం పెన్షనర్స్ కార్యాలయానికి అవసరమైన విరాళం గతంలో అందజేయడం జరిగిందని, రాబోయే రోజులలో ఇలాంటి కార్యక్రమాలను మరెన్నో చేపట్టేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం ఇటీవల వివాహమైన తుమ్మలపెంట సురేష్‌కుమారుడు అడ్వకేట్ సాయి శరణ్ , హర్షిణి నూతన దంపతులను వారు ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్యవర్తక సంఘం అధ్యక్షులు కేవి.సుబ్బారావు, మాజీ మార్కెట్‌యార్డు వైస్‌చైర్మన్ కనమర్లపూటి ప్రసాద్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

**శ్రీ మల్లేశ్వర స్వామి దేవస్థానము-పొలతల**

గంగనపల్లి (గ్రా), పెండ్లిమర్రి (మం), కడప జిల్లా.

**3వ సారి బహిరంగ వేలము ప్రకటన**

సదరు దేవస్థానమునకు సంబంధించి ఈ క్రింది తెలిపిన హక్కును 24/01/2025 తేది ఉదయం 11 గం.లకు సదరు దేవస్థానము నందు బహిరంగ వేలము నిర్వహించబడును.

| వ.నెం. | వివరములు | లీజు కాలము | డిపాజిట్ | |
|---|---|---|---|---|
| 1 | తలనీలాలు సేకరించుకొను హక్కు (ఒక సంవత్సరం కాలము పాటు) | 01/02/2025 నుండి 31/01/2026 | రూ.10,00,000/- | ఇ-టెండర్ కం షీల్డ్ కొటేషన్ కం బహిరంగ వేలము |

పాట పూర్తి అయిన వెంటనే హెచ్చు పాట మొత్తం చెల్లించవలెను. ఇతర షరతులు బహిరంగ వేలము నందు తెలుపబడును.

ఇట్లు

ఎమ్.కృష్ణనాయక్ గ్రేడ్-1,
కార్యనిర్వహణాధికారి
సెల్ నెం.9618655061.

# దొంగతనం మోసంతోనే కోట్ల సంపాదన



**పులివెందుల, జనవరి 17, ప్రభాతవార్త :**

దొంగతనం ,మోసం ,దౌర్జన్యం వంటి అలవాట్లు వున్న వ్యక్తివి నీవే అని ఆ అలవాటు తోనే కోట్ల రూపాయలు సంపదించావు అని నీవు నీ సొంత ఊరిలో చేసిన అన్యాయాలకు సాక్ష్యాలు బాధితులే అని తెదేపా రాష్ట్ర కార్యదర్శి పేర్ల పార్థ సారథి రెడ్డి అన్నారు. పులివెందులలోని తెదేపా కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేల్పుల రామ లింగారెడ్డి ప్రెస్ మీట్ పెట్టి ఆరోపణలు చేయడంతో సమాధానం ఇస్తున్నానని అన్నారు. నేను ఏజెంట్ గా ఉన్న సమయంలో రైజింగ్ కాంట్రాక్టర్లు నియమించి కంపెనీ ఎండి వేదానికి శ్రీరామ్ లకు లక్షల రూపాయలు ఇవ్వడం జరిగిందని ఏజెన్సీ పోయిన తర్వాత నేను కట్టించిన బకాయిలు చెల్లించాలని బాధిత కాంట్రాక్టరులు కోరగా కట్టకపోవడంతో అప్పట్లో స్టేషన్ నందు ఫిర్యాదు చేయడం జరిగిందని రిమాండ్ రిపోర్టు తీసుకుని మద్రాస్ కు వెళ్లి శ్రీరామ్ తమ్ముడు శంకరును అరెస్టు చేసి రిమాండ్ కు పంపగా అతని మామైన కృష్ణమూర్తి మద్రాసు నుంచి వచ్చి కడపలోని కందుల శివానందరెడ్డి ఇంటిలో పంచాయతీ జరిపి కొంతమందికి బకాయిలు చెల్లించడం జరిగిందని సిబ్బందికి జీతాలు చెల్లించలేదని అడగగా అక్కడున్న సామాన్లు అన్నీ చెల్లించాలని మిగిలిన బకాయిలు త్వరలో ఇస్తామని చెప్పారని ఆమేరకే అప్పట్లో ఇనుప సామాగ్రి అమ్మి చెల్లించామని ఇంకా బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. మోసం చేశారని అనడం ఆవాస్తవం ఉన్నారు. నాకు అప్పులు ఉన్నది వాస్తవం భూములు అమ్మి ఇప్పటికి కొన్ని చెల్లించాను, ఇంకొంతమందికి చెల్లించాల్సి ఉందని త్వరలోనే చెల్లిస్తానన్నారు. జడ్పిటిసి గా అన్నా రెడ్డి సాంబశివారెడ్డి పోటీ చేసినప్పుడు రాము పరిస్థితి బియ్యానికి కూడా లేని పరిస్థితి అని, ఆ సమయంలో సాంబశివారెడ్డి చేతుల మీదుగానే రూ.2వేలు, రూ.3వేలు పంపించడం జరిగిందని, కానీ నాకు ఇచ్చానని చెప్పడం అవాస్తవమన్నారు. తెదేపా వారితో స్నేహంగా ఉండి వారికి వెన్ను చూపిన దిట్ట రాము అని అన్నారు. ఒక రాజకీయ నాయకుని నుంచి మైన్స్ ఇస్తానని చెప్పి రూ.30 కోట్లు రాబట్టి మైన్స్ ఇవ్వకుండా, డబ్బు ఇవ్వకుండా వెన్ను చూపింది నువ్వు కాదా అని ప్రశ్నించారు. మీ పూర్వీకులకు లీజ్ ఉందా అని మోసం, దౌర్జన్యంతోనే మైనింగ్ లన్ని లాక్కొని కోట్లకి ఎదిగావు అని ఆన్నారు. వైజాగ్ లో భూ కబ్జాకు పాల్పడి కేసు నమోదు చేయించుకున్న విషయం వాస్తవం కాదా అన్నారు. అనంతరం సొంత ఊరిలో రాము వల్ల ఇబ్బంది పడ్డ బాధితులైన సిద్దయ్య, దళితుడు నాగరాజు తదితరులతో వారికి జరిగిన అన్యాయాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గోకుల షెడ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి



**కలికిరి, జనవరి 17, ప్రభాతవార్త:**

మండలంలోని 14 పంచాయతీల్లో పల్లె పండగ కార్యక్రమంలో ప్రభుత్వం మంజూరు చేసిన గోకుల్ షెడ్ల నిర్మాణ పనులురైతులు వేగవంతం చేయాలని ఎంపీడీవో భానుమూర్తిరావు రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని పంచాయతీల్లో నిర్మాణంలో ఉన్న గోకుల్ షెడ్ల నిర్మాణ పనులు ఆయన పరిశీలించి రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. మండలానికి 26 గోకుల్ షెడ్లు మంజూరు చేయగా ఇప్పటికే 19 గోకుల్ షెడ్ల నిర్మాణ పనులు పూర్తయి ప్రపారంభించడం జరిగింది. దీంతో 90 శాతం గోకుల షెడ్ల నిర్మాణ పనులు పూర్తి చేయడం జరిగింది. మిగతావి కూడా అతి త్వరలో పూర్తి చేయాలని ఎంపీడీవో రైతులకు సూచించారు. ఇప్పటికే మండలంలో ప్రభుత్వం మంజూరు చేసిన గోకుల షెడ్ల నిర్మాణ పనులు రైతులకు, పశువులకు ఉపయోగపడుతు సత్ఫలితాలు ఇస్తున్నాయి. ఈ నిర్మాణ పనులు వేగవంతం చేయడంలో ఏపీవో సుజాత, ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్లు మనోహర్, రెడ్డిబాషా, రవికుమార్, బొజ్జమ్మ, ఆయా పంచాయతీల ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ రైతులకు సకాలంలో పనులకు సంబంధించి సలహాలు సూచనలు ఇస్తూ పనులు వేగవంతంగా జరిగేలా కృషి చేస్తున్నారు. పూర్తయిన గోకుల్ షెడ్ల నిర్మాణాలు ఇటీవల ఎంపీడీవో భానుమూర్తిరావు ఆయా పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీలతో ప్రారంభించడం జరిగింది.

## నేడే స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివసే కార్యక్రమం విజయవంతం చేయాలి

**కలికిరి, జనవరి 17, ప్రభాతవార్త:**



జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదేశాల మేరకు శనివారం కలికిరి మండలంలోని 14 పంచాయతీల్లో స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివసే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీవో భానుమూర్తిరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని పంచాయతీలోని అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, అంగన్వాడీ, డ్వాక్రా అధికారులు, సిబ్బంది పాల్గొని విజయవంతం చేయాలన్నారు. శనివారం ఉదయం 9 గంటలకే ఈ కార్యక్రమాన్ని పంచాయతీలలో ఆయా సర్పంచుల ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు కార్యక్రమాన్ని ప్రారంభించాలన్నారు. గ్రామంలోని అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాలను శుభ్రపరచాలన్నారు. కార్యక్రమం ముందు, తరువాత తీసిన ఫోటోలు పీఆర్-1 యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, వెలుగు శాఖాధికారులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు పాల్గొనేలా పంచాయతీ కార్యదర్శులు చూడాలన్నారు. ఈ కార్యక్రమాలను జిల్లా ఉన్నతాధికారులు సందర్శించే అవకాశం ఉందని మండల స్థాయి అధికారులు, పంచాయతీ స్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రభుత్వ కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా కృషి చేయాలని ఎంపీడీవో పేర్కొన్నారు.

## పర్యటనను విజయవంతం చేయండి



**మైదుకూరు, జనవరి 17, ప్రభాతవార్త :**

రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛత హి సేవ కార్యక్రమాన్ని కడప జిల్లా మైదుకూరు మున్సిపాలిటీలో ప్రారంభించడం ప్రజలు సంతోషించాల్సిన విషయం అన్నారు. ముఖ్యమంత్రి ముందుగా నంద్యాల రోడ్డు కెఎస్ఆర్ కళ్యాణ మండపంలో తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులర్పిస్తారని.అనంతరం కార్యకర్తలతో మాట్లాడడం భోజన కార్యక్రమాలు చేసుకుని జిల్లా పరిషత్ హైస్కూల్ గ్రౌండ్‌లోకి వస్తారని. మున్సిపాలిటీ ప్రజలతో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛత హి సేవ స్వచ్ఛ మైదుకూరు ప్రోగ్రాం కార్యక్రమంలో పాల్గొని ప్రజలతో వినతుల స్వీకరణ నిర్వహిస్తారని తెలిపారు. మున్సిపాలిటీలోని అభివృద్ధి,పట్టణ ఆధునీకరణ,రాజోలి ఆనకట్ట, పాలిటెక్నిక్ కాలేజీ, మహిళల హై స్కూల్, డిగ్రీ కాలేజ్, పట్టణ అభివృద్ధిపై ఆయన దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని. నియోజకవర్గ అభివృద్ధి పై కూడా సహకరిస్తారని కోరుకుంటూ మన నియోజకవర్గ ప్రజలు మున్సిపాలిటీ ప్రజలు తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని ఈ పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు దాసరి బాబు, ఉప్పుగుంటపల్లి సి.కిషోర్ బాబు, జాండ్లవరం నాయుడు,ఏ.పి రవీంద్ర, ధనపాల జగన్,ఆకుల క్రిష్ణయ్య,బిపి సుధాకర్ రెడ్డి, బి ఎన్ శ్రీనివాసులు, పాశం మారుతి, మిల్లు శ్రీను, మునిశేఖర్ రెడ్డి, పెరుగు వీరనారాయణ యాదవ్,భీమయ్య,శీర్ల నాగ మోహన్, నారాయణ యాదవ్,కటారి క్రిష్ణ,కోన సుబ్బారావు, యాపారాల చిన్న, తెలుగుదేశం నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నేడు నందమూరి తారకరామారావు

# వర్ధంతి వేడుకలు

**ములకలచెరువు, జనవరి 18 ప్రభాతవార్త :**

మండల కేంద్రమైన మొలకలచెరువులో దివంగత ఎన్‌టిరామారావు వర్ధంతి వేడుకలు నేడు ఘనంగా నిర్వహించనున్నట్లు మండల టిడిపి కన్వీనర్ పాలగిరి సిద్ద తెలిపారు. మూడురోజుల కూడలిలో జాతీయ రహదారిపై ఎన్‌టిఆర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి వర్ధంతి వేడుకలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## కడప నగర వెస్ట్ జోన్ అధ్యక్షునిగా నాగేందర్ రెడ్డి



**కడప జనవరి 17, ప్రభాతవార్త:**

ఈరోజు మాజీ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి నివాస కార్యాలయం నందు వెస్ట్ జోన్ అధ్యక్షుడు నాగేందర్‌రెడ్డిని సన్మానించిన మాజీ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజాద్ భాషా. ఈ కార్యక్రమంలో మాజీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు దాసరి శివప్రసాద్, జిల్లా యువజన విభాగం అధ్యక్షులు దేవి రెడ్డి ఆదిత్య,సౌత్ జోన్ అధ్యక్షులు పెద్దిరెడ్డి రామ్మోహన్ రెడ్డి, కార్పొరేటర్లు త్యాగరాజు, అస్మతుల్లా, కోఆప్షన్ సభ్యులు హరున్ బాబు, ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు కంచుపాటి బాబు, రమేష్ సంజీవ నాయుడు శ్యామ్, తదితరులు ఉన్నారు.

## సాఫ్ట్ నైపుణ్యాలపై వర్క్‌షాపు



**కురబలకోట, జనవరి 17 ప్రభాతవార్త :**

మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం సాఫ్ట్ నైపుణ్యాలపై వర్క్షాపు నిర్వహించారు. ఇంగ్లీష్, విదేశీభాషల విభాగం వారు అధ్యాపకులకు ప్రస్తుత కార్పొరేట్ దృశ్యాన్ని అనుసరించడంలో సాఫ్ట్ నైపుణ్యాలను పునర్నిర్మించడం అనే అంశంపై ఈవర్క్షాపును నిర్వహించినట్లు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామనాథం తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధి రీతూశర్మ మాట్లాడుతూ ప్రతి వ్యక్తికి ప్రవర్ధన వ్యక్తుల మద్య కమ్యూనికేషన్, నాయకత్వం,సమస్య పరిష్కారం, నిర్వాహక, వ్యక్తిత్వ లక్షణాలు ఎంతో ముక్యమని ఇవి మానవుని వ్యవస్థీకృత, ప్రవర్ధన కలిగిన ప్రతిబింబాన్ని సూచించే నైపుణ్యాలు అవసరమని అన్నారు. విద్యార్థుల రీసూమో మరియు గ్రూప్ డిస్కర్షన్, మరియు పరిశ్రలు జరుగుతున్న నూతన విషయాలను ముందుగా తెలుసుకొని విద్యార్థులకుప్రతి అధ్యాపకులు శిక్షణ ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి డాక్టర్ షమీనా, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

## అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబ




**మదనపల్లె, జనవరి 17 ప్రభాతవార్త :**

కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ఏఐటియుసి కార్యాలయంలో మున్సిపల్ వర్కర్స్‌యూనియన్ కమిటీ సమావేశం సురేష్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిధిగా హాజరైన జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడునెలలు అవుతున్నా ఇంతవరకు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల గురించి పట్టించుకొన్న పాపాన పోలేదన్నారు. జిల్లాల విభజన తరువాత అరకొర ఉన్న పరిశ్రమలు తిరుపతి జిల్లాలో ఉన్నాయని, అన్నమయ్య జిల్లాలో నూతన పరిశ్రమలు ఏర్పాటు చేసి కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు ఉన్న అవుట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలన్నారు. అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం, ప్రభుత్వ పాఠశాలల ఆయాలకు పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు చెల్లించి, చిరుద్యోగులకు ఉద్యోగభద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేష్‌కుమార్, నాగరాజు, మస్తాన్, వృద్వీరాజ్, ఓబులేసు, మధు తదితరులు పాల్గొన్నారు.

## విధులకు డుమ్మా కొట్టిన గ్రామ సచివాలయ సిబ్బంది

**సిద్దవటం, జనవరి 17, ప్రభాతవార్త:**



మండలంలోని బొగ్గిడివారిపల్లి గ్రామ సచివాలయంలో సిబ్బంది 11 మంది ఉద్యోగులు ఉండగా విధులకు పంచాయతీ సెక్రటరీ, వీఆర్వో, విలేజ్ సర్వేయర్, ఆరోగ్య కార్యకర్త, నలుగురు మాత్రమే హాజరయ్యారు. మిగతా 7 మంది ఉద్యోగులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్, ముని కుమార్, వెటర్నరీ గంగోత్రి, అగ్రికల్చర్ సందీప్, మహిళా పోలీసు వనజాక్షి, వెల్ఫేర్ హరీష్, డిజిటల్ అసిస్టెంట్ ఉదయ, రీనా విధులకు ఉదయం 11 గంటలు కావస్తున్నా హాజరు కాలేదు. ఒక వేళ ఫీల్డ్ వర్క్‌కు వెళ్లినా సచివాలయానికి వచ్చి రిజిస్టర్‌లో సంతకాలు చేసి మూమెంట్ రిజిస్టర్‌లో నమోదు చేసుకొని వెళ్లాలి. అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకాలు నలుగురు ఉద్యోగులు మాత్రమే నమోదు చేశారు. వివిధ పనుల మీద వచ్చిన పల్లె ప్రాంతాల ప్రజలు సిబ్బంది లేకపోవడంతో వెనుదిరిగారు. సచివాలయ సిబ్బంది పనితీరు పర్యవేక్షణ తనిఖీల లోపంతో ఉద్యోగులు విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తున్నారని పలువురు అభిప్రాయపడ్డారు. సచివాలయ ఉద్యోగులు విధులకు హాజరు కాని విషయమై కడప జిల్లా గ్రామ సచివాలయ ఇన్‌ఛార్జి అధికారి సుబ్రమణ్యంను వివరణ కోరగా విధులకు హాజరు కాని వారిపై విచారించి కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు.

## శరవేగంగా కాలువ మరమ్మత్తు పనులు

ఆయకట్టు చైర్మన్ కొటాల శివకుమార్.



**తంబళ్లపల్లె జనవరి 17 ప్రభాతవార్త :**

అన్నమయ్య జిల్లాకే తలమాణికంగా నిలిచిన తంబళ్లపల్లె మండలం కొటాల పంచాయతీ పరిధిలోని పెద్దేరు ప్రాజెక్టు కాలువల మరమ్మత్తు పనులు శరవేగంగా జరుగుతున్నట్లు ఆయకట్టు చైర్మన్ కొటాల శివకుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన మరమ్మతు పనులను పరిశీలించి ప్రాజెక్టు కుడి కాలువ 17 కి.మీ కు గాను 13 కి.మీ, ఎడమ కాలువ 15 కి.మీ కు గాను 13 కిలోమీటర్లు ముండ్ల కంపల తొలగింపు, రోడ్లు మరమ్మత్తు పనులు జరుగుతున్నట్లు చెప్పారు. ఈ నెలాఖరుకు కాలువల్లో ప్యాచింగ్ మరమ్మతులు పూర్తి చేసి రబీ సీజన్లో ఆయకట్టులోని చెరువులకు నీరు అందించి తద్వారా చెరువుల కింద సాగు, మూగజీవాలకు తాగునీటి సౌకర్యంకు సహకరిస్తామన్నారు. ప్రాజెక్టు పనులలో కాంట్రాక్టర్ శ్రీనివాసుల రెడ్డి నాణ్యత లోపం లేకుండా కాలువ పనులు పటిష్టంగా ఉండటానికి సహకరిస్తున్నట్లు చెప్పారు. మరమ్మత్తు పనులకు నిధుల మంజూరుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు, జిల్లా మంత్రి రాంప్రసాద్ రెడ్డి, తంబళ్లపల్లె ఇంచార్జ్ దాసరిపల్లి జయచంద్రారెడ్డి, సమన్వయకర్త సీడ్ మల్లికార్జున నాయుడులకు కృతజ్ఞతలు తెలుపుతూ ప్రాజెక్టు కాలువల పటిష్టత, గెస్ట్ హౌస్, క్వార్టర్స్, మరుగుదొడ్ల నిర్మాణాలు, తాగునీరు, ప్రాజెక్టులో బోటింగ్, పార్కింగ్ ఆధునీకరణకు సహకరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

## క్రీడలతోనే మానసిక ఉల్లాసం

ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



**మదనపల్లె, జనవరి 17 ప్రభాతవార్త :**

క్రీడలతోనే క్రీడాకారులకు మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దృఢత్వం ఏర్పడుతుందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. శుక్రవారం జిఆర్‌టిస్కూల్ మైదానంలో 14వ ఏపి సబ్‌జూనియర్ రాష్ట్రస్థాయి హాకీ పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన 21జట్లు హాకీ టోర్నమెంటులో పాల్గొనడం అభినందనీయమన్నారు. హాకీ క్రీడలకు మదనపల్లె పుట్టినిల్లు అన్నారు. దేశంలోనే మదనపల్లెకు హాకీ క్రీడతో ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు. హాకీ క్రీడా పితామహుడు ధ్యాన్‌చంద్ మదనపల్లెలో హాకీ ఆడడంతోనే గుర్తింపు లభించిందన్నారు. హాకీలో క్రీడాకారులు గెలుపుఓటములను సాధారణంగా తీసుకోవాలన్నారు. ఓటమి గెలుపుక సోపానమన్నారు. మూడురోజులు పాటు జరిగే హాకీ టోర్నమెంటుకు వసతుల కల్పనకు కూడా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే హాకీ ఆడి అందరిని అబ్బురపరిచారు. ఈకార్యక్రమంలో మున్సిపల్‌ఛైర్‌పర్సన్ మనూజారెడ్డి, హాకీ అసోసియేషన్ అధ్యక్షులు పివి.ప్రసాద్, ప్రధాన కార్యదర్శి శివప్రసాద్, హాకీ పూర్వ క్రీడాకారులు పాల్గొన్నారు.

## అమ్మవారికి ప్రత్యేక పూజలు

**రామసముద్రం జనవరి17 ప్రభాతవార్త**



మండలం పెద్దకురప్పల్లె గ్రామ పంచాయతీ తిరుమలరెడ్డిపల్లె గ్రామంలో వెలిసిన మారేమ్మ ఆలయంలో శుక్రవారం అమ్మ వారిఆలయ శుద్ధి చేసి మారేమ్మ కి పలురకాల పుష్పాలు, వేపాకుతో అలంకరణ చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు అర్చనలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. పూజారి కృపాకర, భక్తులకు అమ్మ వారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు.రాత్రి అమ్మవారి ఆలయం లో భక్తులు భజన లు అమ్మ వారి కీర్తనలు ఆలపించారు.

## నీటి విడుదలపై స్పష్టమైన ప్రకటన చేయాలి

**దువ్వూరు, జనవరి 17, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని కేసీ కాలువకు రబీ సీజన్‌లో నీరు ఎంత వరకు విడుదల చేస్తారని స్పష్టమైన ప్రకటన చేయాలని కేసీ కాలువ రైతాంగం కోరుతుంది. ప్రస్తుతం కేసీ కాలువలో 2అడుగుల మేర నీరు వస్తుంది. రబీ సీజన్‌లో ప్రస్తుతం జనవరిలో కేసీ కాలువ కింద నూగు, సజ్జ, జొన్న, కొర్ర వంటి పంటలు సాగు చేసుకోవాలని రైతులు భావిస్తున్నారు. అయితే కేసీ కాలువ నీటి విడుదల విశయంపై స్పష్టమైన ప్రకటనను కేసీ కాలువ అధికారులు ఇంతవరకు చేయలేదు. కనీసం మార్చి 30వరకైన నీరు విడుదల చేస్తే నూగు, కొర్ర వంటి పంటలు సాగు చేసుకుంటామని ఆ విధంగా కేసీ అధికారులు స్పష్టమైన ప్రకటన చేయాలని రైతులు కోరుతున్నారు.

## క్రికెట్ ట్రోఫీనీ కైవాసం చేసుకున్న వి ఆర్ 11 టీం

**బ్రహ్మంగారి మఠం, జనవరి 17 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని సంక్రాంతి సందర్భంగా 9వ తేదీ ప్రారంభమై 20 టీములు పాల్గొనగా శుక్రవారం 17 తేది ముగిశాయి నరసన్న పల్లె వీఆర్ 11 టీంకు మొదటి బహుమతిగా ట్రోఫీని 20000 నగదును తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి చేతుల మీదుగా అలాగే కొత్తూరు గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు సూర్యనారాయణ చేతులు మీదుగా అందజేశారు. రెండవ బహుమతి నరసన్న పల్లె 11 టీం కు మండల తెలుగుదేశం నాయకులు ఎస్సార్ శ్రీనివాసులు రెడ్డి చేతుల మీదుగా ట్రోఫీని 10000 నగదును అందజేశారు. మూడవ బహుమతి గంగిరెడ్డి పల్లె టీం కు 5000 రూపాయలను నగదును ట్రోఫీని తెలుగుదేశం నాయకులు సాంబశివరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఇంకా కొద్ది మందికి గోల్డ్ మెడల్ బహుమతులు కూడా అందజేశారు. ఈ టోర్నమెంటు తిప్పన నరేష్ నాయుడు జ్ఞాపకార్థం ఆయన సోదరుడు తిప్పన సురేష్ నాయుడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమం పాల్గొని జయప్రదం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.



## ముఖ్యమంత్రి పర్యటనను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**కడప, జనవరి 17 ప్రభాతవార్త**

స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మైదుకూరులో పర్యటించనున్న నేపథ్యంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పర్యటనా ఏర్పాట్లను పరిశీలించారు. మైదుకూరు కోర్టు సముదాయం సమీపంలోని హెలిప్యాడ్, దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమం జరిగే ఫంక్షన్ హాలు, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా స్వచ్ఛ మైదుకూరులో పారిశుధ్యంపై ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలు, నేషనల్ గ్రీన్ కార్ప్స్‌తో ర్యాలీ నిర్వహించె నలుగురోడ్ల కూడలి, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ముఖ్యమంత్రి సభ, గ్యాలరీ, స్టాళ్ల ఏర్పటు పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించి అధికారులకు పలు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట తెదేపా రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డప్పగారి శ్రీనివాస రెడ్డి, ముఖ్యమంత్రి పర్యటనల కో ఆర్డినేటర్ పెందుర్తి వెంకటేష్ (మాజీ శాసనసభ్యులు), ఏఎస్పీ కె. ప్రకాష్ బాబు, జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, బద్వేలు, జమ్మలమడుగు ఆర్డీవోలు చంద్ర మోహన్, సాయిశ్రీ, కేఎంసి కమీషనర్ మనోజ్ రెడ్డి, జిల్లా అధికార యంత్రాంగం తదితరులు పాల్గొన్నారు.

## శారీరక మానసికోల్లాసానికి క్రీడలు ఎంతో ముఖ్యం



**గాలివీడు, జనవరి 17(ప్రభాతవార్త):**

శారీరక మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో ముఖ్యమని రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు మండిపల్లి రాహుల్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని అరవీడు గ్రామ పంచాయతీలోని ఎల్లంపల్లిలో నిర్వహించిన వైపీఎల్-8 క్రికెట్ లీగ్ ఫైనల్ మ్యాచ్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి యువకుడు క్రీడలకు ప్రాధాన్యతనివ్వాలని తెలిపారు. అనంతరం విజయం సాధించిన జటుకు మొదటి బహుమతిగా రూ.21 వేలు ఎంపీఈఈ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వారు, ద్వితీయ బహుమతి మండల కేంద్రంలోని రవిచంద్ర సీనియర్ సెకండరీ స్కూల్, గౌతమ్ స్కూల్ వారి ఆధ్వర్యంలో రూ.11 వేలు, తృతీయ బహుమతి శ్రీ వేంకటేశ్వర గ్రానైట్స్ శ్రీనివాసులు రూ.7500 అందించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు రాజశేఖర్, క్రీడాకారులు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## లయన్స్ క్లబ్ ఆఫ్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ

**రాజంపేట అర్బన్ జనవరి 17 ప్రభాతవార్త**

రాజంపేట లయన్స్ క్లబ్ ఆఫ్ ఆధ్వర్యంలో చలికి తీవ్రంగా ఇబ్బంది పడుతున్న రాజంపేట రైల్వే స్టేషన్ పరిసరాల్లోని యాచకులకు శుక్రవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని చేపట్టిన రాజంపేట లయన్స్ క్లబ్ అధ్యక్షులు నరసింహ రాజు, జిల్లా చైర్మన్ పోతు గుంట రమేష్ నాయుడు, జోన్ చైర్మన్ సుబ్రహ్మణ్యం రాజు, మాజీ రీజన్ చైర్మన్ మద్దిపట్ల రామకృష్ణ నాయుడు, మాజీ జోన్ చైర్మన్ ఆరే .వెంకటసుబ్బయ్య నాయుడు మాజీ కార్యదర్శి దండే రవికుమార్ మాట్లాడుతూ పేద ప్రజలకు ఆపన్న హస్తంగా లైన్స్ క్లబ్ సేవ చేయడంలో ఎప్పుడూ ముందుంటుందని అన్నారు.చలికాలంలో బహిరంగ ప్రదేశాల్లో నిద్రించే యాచకులు తీవ్రంగా ఇబ్బంది పడుతూ ఉంటారన్నారు. అందు

## కర్ణాటక నుండి రామసముద్రం మీదుగా వెంకటేశ్వర స్వామి భక్తులు తిరుమలకు పాద యాత్ర



**రామసముద్రం జనవరి 17 ప్రభాతవార్త**

మండల కేంద్ర కర్ణాటక భార్డర్ లోని సోమయాజుల పల్లె మండలం చెందిన వెంకటేశ్వర స్వామి భక్తులు సుమారు 400 మంది భక్తులు తిరుమలకు పాద యాత్రకు రామసముద్రం మీదుగా బయలుదేరారు. శుక్రవారం లక్ష్మిజనార్ధన స్వామి ఆలయం, దిన్నిపల్లె గెవితిమ్మరాయ స్వామి మొహద్వారం దగ్గర పూజలు చేసి అనంతరం బయలుదేరారు. ఈ సందర్భంగా శ్రీవారు భక్తులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జనవరి నెల నూతన సంవత్సరం సందర్భంగా స్వామిని దర్శించు కోవడం జరుగుతుందన్నారు. గత ఎనిమిది సంవత్సరాలుగా సుమారు 400 మంది భక్తులు స్వామిని దర్శించుకుంటామని చెప్పారు. ప్రతి సంవత్సరం స్వామివారిని పాదయాత్ర చేసుకుంటూ దర్శనం చేసుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. సురేష్, మంజు, రాజన్న, వెంకటేష్, నాగరాజ, శివ నాగప్ప, వెంకటమ్మ, లక్ష్మి, గోవిందమ్మ రాజారెడ్డి రామసముద్రం మీదుగా తిరుమలకు పాదయాత్రకు భక్తులు స్వామి దర్శనం కోసం వెళ్లారు.

## ఐటీతో ఉజ్వల భవిష్యత్తు

**కలకడ జనవరి 17 ప్రభాతవార్త :**

ఐటీతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ప్రిన్సిపాల్ మలంగ్ షా వలి పేర్కొన్నారు. మండలంలోని స్థానిక ఆదర్శ పాఠశాలలో 10 రోజులపాటు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఐటి రంగంపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు ఇంటర్నెట్ షిప్ వల్ల వర్కింగ్ స్కిల్స్ పెంపొందించుకునేందుకు అవకాశాలు మెండుగా ఉన్నాయని సూచించారు పది రోజులపాటు శిక్షణ పొందే విద్యార్థులకు భవిష్యత్తులో ఉపయోగపడే దృవీకరణ పత్రాలు అందజేయడం జరుగుతుందని ఈ విషయాన్ని విద్యార్థులు గుర్తించి పదిరోజుల పాటు శిక్షణ తీసుకోవాలని ఆయన కోరారు.

